పంట రుణాలు తీసుకున్న వారి లిస్ట్ బహిరంగ పరచండి

ఏపి కౌలు రైతులు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య

విశాలాంధ్ర-చోడవరం : ప్రతీ కౌలు రైతు కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిభందనలు ప్రకారం ఎటువంటి హామీ లేకుండానే రూ.1.60 లక్షల వరకు పంట రుణాలు అందించి ఆదుకొవాలని ఏ.పి. కౌలు రైతులు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరారు. పంట రుణాలు తీసుకున్న వారి లిస్తులు బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. పంట రుణాలు పొందిన రైతులు, కౌలు రైతులు పేర్లు లిస్ట్ లను బ్యాంక్ బ్రాంచి కార్యాలయం, గ్రామ పంచాయతీ, రైతు సేవా కేంద్రాలు వద్ద బహిరంగ పరచాలని కోరారు. రూపాయి అప్పుకు లక్షా తొంభై నిభందనలు చెప్పే బ్యాంకర్లకు ప్రభుత్వ/ రిజర్వ్ బ్యాంక్ నిభందనలు వర్తించవా అని ప్రశ్నించారు. స్థానిక బ్యాంకర్లు విధించే వారి సానుకూల నిబంధనలతో బ్యాంకు ల నుండి అప్పు తెచ్చుకోలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది అని తెలిపారు. పంట రుణాలు తీసుకున్న వారి వివరాలు బహిరంగ పరిస్తే, అస్సలు వివరాలు బయటపడతాయని అన్నారు.

విజయశ్రీ... లో కార్మికునికి తీవ్రగాయాలు

సమగ్ర విచారణ జరిపించాలని గనిశెట్టి డిమాండ్

విశాలాంధ్ర-పరవాడ: జేఎస్ ఫార్మా సిటీలోని విజయశ్రీ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో కనకారావు అనే ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చిక్సి పొందుతున్నాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనను యాజమాన్యం గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్మికుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కార్మిక నేతలు తెలిపిన వివరాల మేరకు.. కంపెనీలోని 20 మీటర్ల ఎత్తులో లిఫ్ట్ మొరాయించింది. దీంతో కనకారావు ఓ రాడ్డు సహాయంతో లిఫ్ట్‌ను సరిచేస్తుండగా ప్రమాద వశాత్తు లిఫ్ట్‌తో పాటు అతడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కంపెనీ ఉద్యోగులు అతన్ని వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడ్డ కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంపై ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పోలీసులు సమగ్ర విచారణ చేయాలని, కార్మికుడు కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

సాగర్ సిమ్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

విశాలాంధ్ర-కశింకోట: గత రెండు సంవత్సరాలనుండి సాగర్ సిమెంట్ ఆధ్వర్యంలో మండలం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతిలో ప్రధమ,ద్వితీయ, తృతీయ రేంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. అదేవిధంగా ఈ ఏడాది రేంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులు కు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కంపెని సీనియర్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు,జనరల్ మేనేజర్ పాండురంగారావు లు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల్లో సాగర్ సిమెంట్ 6 కంపెనీలు వున్నాయని మన రాష్ట్రం లో 3 ఉన్నాయన్నారు. ఈ 6 కంపెనీల్లో ను ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సంస్థ ద్వారా ఎన్నో ప్రజా హిత కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మండలం లో 13 ఉన్నత పాఠశాలలు వున్నాయని ప్రతి పాఠశాలకు 3 బహుమతులు చొప్పున అందజేస్తున్నామని తెలిపారు. ప్రధమ బహుమతి రూ.20వేలు ద్వితీయ బహుమతి 15వేలు, తృతీయ బహుమతి 10వేలు గా పాఠశాల ఒక్కంటికి 45వేల చొప్పున 13 పాఠశాలలకు కలిపి 5,85,000 ల రూపాయలు నేడు విద్యార్థులకు వారి తల్లి దండ్రులు,ఉపాధ్యాయులు సమక్షంలో అందజేయడం జరిగింది అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పి.వెంకట సురేష్, కే.ఏస్.యెన్.మూర్తి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,తల్లి దండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతహే సేవా కార్యక్రమం

విశాలాంధ్ర-నక్కపల్లి : గ్రామాల్లో స్వచ్ఛతహే సేవా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నక్కపల్లి ఉప్మాక దేవవరం గ్రామాల్లో ఎంపీడీవో దెందుకూరి సీతారామరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉప్మాక గ్రామంలో శానిటేషన్ నిర్వహించి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి కొప్పిశెట్టి కొండబాబు టిడిపి మండల శాఖ క్లస్టర్ ఇంచార్జ్ కొప్పిశెట్టి బుజ్జి గ్రామ పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్ ఉప్మాక జనసేన పార్టీ అధ్యక్షుడు పాము గణేష్ మనబాల తాతారావు సర్పంచ్ వీరబాబు ఎలమంచిలి శ్రీను జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రామభక్తుడు మళ్ల అనంతరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-మునగపాక: రామ భక్తుడు మళ్ల అనంతరావును నాగులాపల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఏటా వంద రామ కోటి పుస్తకాలు రాసిన వీర భక్తు డంటూ పలువురు ప్రసంశించారు. రామకోటి రాసిన 100 పుస్తకాలను ఉదయం 7 గంటల నుండి పల్లకిలో నాగులాపల్లి గ్రామం లో భక్తిశ్రద్ధలతో ఊరేగించి రామాలయంలో పెట్టడం పెట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నసమారణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాత్రి రామభక్తులచే హరిభజన కార్యక్రమం జరిగింది.ఈ కార్య క్రమంలో హిందూధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ వాసు, రామాప్రభూ, ఈశ్వరరావు, సూర్యప్రభ, నూకరత్నం, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రాజు

విశాలాంధ్ర-యలమంచిలి: మున్సిపాలిటీలోని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ-2024 కార్యక్రమంలో భాగంగా శనివారం సైతార్ పేట రోడ్డు, పెంజేరువూ ఏరియాలో మాస్ క్లీన్లీనెస్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యలమంచిలి మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛత కార్య క్రమంలో భాగంగా తుప్పలను, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.జె. ఎస్.పి.రాజు మాట్లాడుతూ వారంలో ఒకరోజు ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ద్వారా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆదేశాల మేరకు యలమంచిలి పట్టణంలో ఎక్కడ కూడా మలవిసర్జన చేయరాదని అలాగే మంచినీటి పైపులు ఎక్కడైనా లీకేజీలు ఉంటే వాటిని వెంటనే రిపేర్లు చేసి ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చూడాలని తెలిపారు. శానిటేషన్ పరంగా ఏరియా లన్ని పరిశుభ్రంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారు కావున పట్టణ ప్రజలకు తెలియజేయునది కాచి చల్లార్చిన నీటిని త్రాగవలనని, మీ ఇంటి పరిసరాలలో ఉన్నటువంటి వాటర్ ట్యాంకులు, పూల కుండీలు, బాత్రూంలోని, ఫ్రిడ్జ్ ల దగ్గర, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని దాని ద్వారా డెంగ్యూ వ్యాధి నుండి రక్షింపబడుదురని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ సభ్యులు సీర సాయి, ప్రసన్న చిరంజీవి, కొటరు నాగమణి కొండబాబు, పీల కనకమణి త్రినాథ్ రావు, మజ్జి రామకృష్ణ, టిపిఓ శ్రీలక్ష్మి, ఏఈ గణపతి సుబ్బారావు, మేనేజర్ విజయకుమార్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-చోడవరం: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు ప్రతిష్టాత్మంగా తీసుకొని అత్యధిక మందిని పార్టీలో చేర్చే విధంగా చొరవ చూపాలని చోడవరం ఎమ్మెల్యే కె. ఎస్.ఎన్.ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. శనివారం నియోజకవర్గం పరిధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

ఉచిత ఇసుక ముసుగులో వ్యాపారం చేస్తే కఠినచర్యలు

కలెక్టరు విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: వ్యక్తిగత అవసరాల పేరిట, ఉచిత ఇసుక ముసుగులో వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ హెచ్చరించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులకు ఇసుక తవ్వకాలపై ఆదేశాలు జారీచేసారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ. వ్యక్తిగత అవసరాలకు ఇసుక తవ్వకాలు జరిపే చోట వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వాల్టా చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు తక్కువ ధరకు, ఎక్కువ ఇసుక అందించాలని నూతన ఇసుక పాలసీ ద్వారా ప్రభుత్వం సీనరేజి, జిఎస్టి రద్దు చేయడం జరిగిందని తెలిపారు. స్థానిక అవసరాలకు ఇసుక ఉచితంగా తీసుకు వెళు టకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వంతెనలు, కట్టడాలు, మంచినీటి పథకాలకు యాభై మీటర్ల దూరం వరకు, కరకట్టలకు పదిహేను మీటర్లవరకు, భూగర్భజలాలు తక్కువగా గల చోట్ల తవ్వకాలు జరుపకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనిపై గ్రామాలలో ప్రజలకు తెలిసే విధంగా దండోరా వంటి పద్ధతులలో ప్రచారం చేయాలని తెలిపారు. ఇసుక కనీసం మూడు మీటర్లు ఎత్తు ఉన్న చోట మాత్రమే ఒకమీటరు వరకు ఇసుకను తీసుకోవచ్చునని తెలిపారు. భూగర్భజలాలు నిలకడగా ఉండుటకు నదిలో కనీసం రెండు మీటర్ల ఎత్తున ఇసుక ఉండాలని తెలిపారు. స్థానికంగా స్వంత అవసరాలకు ఇసుక కావలసినవారు స్థానిక అధికారులకు సమాచారం అందించి తీసుకోవాలని తెలిపారు. ఎడ్ల బండ్లద్వారా మాత్రమే తీసుకువెళ్లాలని, ఇసుక తవ్వడానికి, రవాణాకు మోటారు వాహనాలు వినియోగించకూడదన్నారు. స్వంత అవసరాల పేరిట బండ్లపై ఇసుకను తీసుకువచ్చి వాహనాల ద్వారా వ్యాపారం చేసే వారిపై కేసులు పెట్టడం జరుగుతుందని, పి.డి.యాక్టు ప్రయోగించడం జరుగుతుందన్నారు. జిల్లా లో ఇసుక రీచ్ లు లేవని, స్టాకు పాయింటులు నక్కపల్లి, గబ్బాడ వద్ద ఉన్నాయని, ఇసుక కావలసిన వారు ప్రస్తుతం ఇసుక అందుబాటులో గల గబ్బాడ పాయింటు నుండి మాత్రమే బుకింగుద్వారా పొందవచ్చునని తెలిపారు. స్వంత భూములలో ఇసుక గలవారు కూడా ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోవాలన్నారు. జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి మాట్లడుతూ. ఇసుక తీసుకువెళ్లే బండ్లు, వాహనాలు ప్రభుత్వ ఉచిత పథకం బ్యానరు కట్టాలని తెలిపారు. బల్క్ బుకింగు ద్వారా ఇసుక కావలసినవారు తమకు ధరఖాస్తు చేస్తే అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా మాట్లాడుతూ. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసులు పెట్టడం తోపాటు పిడి యాక్టు ప్రయోగిస్తామన్నారు. ఇసుక రవాణాకు ఇ-ట్రాన్సిట్ ఫారం తప్పని సరిగా ఉండాలని తెలిపారు. ఇసుక రవాణాకు ఉపయోగించే అన్ని వాహనాలకు జిపిఎస్, ఉచిత ఇసుక పథకం బ్యానరు ఉండాలన్నారు. ఉదయం 6గంటల నుండి సాయంత్రం 6గంటలవరకు మాత్రమే ఇసుక కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా అంతరాష్ట్ర సరిహద్దులలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాలు తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, జిల్లా గనులు శాఖ అధికారి ఎం.శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసిన ఎమ్మెల్యే సుందరపు

విశాలంధ్ర-అచ్యుతాపురం : జిల్లా ఎస్ పి తుహిన్ సిన్హా శుక్రవారం అనకాపల్లి ఎస్ పి కార్యాలయంలో యలమంచిలి నియోజ కవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు . నేరాల నియంత్రణలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని, గంజాయి నియంత్రణ మీద దృష్టి పెట్టా లని, మహిళల మీద జరుగుతున్న దాడులను అరికట్టే విధంగా తగు చర్యలు తీసు కోవాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం ఉండేటట్లు చూడాలని కోరారు.

పార్టీ అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలి

టిడిపి మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు

విశాలాంధ్ర-పాయకరావుపేట: టీడీపీ అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. పార్టీ కార్యాలయంలో 2024-2026 టీడీపీ సభ్యత్వ నమోద కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ గతం కంటే ఎక్కువగా సభ్యత్వాలను నమోదుచేయాలని, నియోజకవర్గంలోని మిగిలిన మండలాల కంటే పాయకరావుపేట మండలంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీ విశ్వనాథ్, మజ్జూరి నారాయణరావు, చింతకాయల రాంబాబు, మల్లపురెడ్డి రమా కుమారి, చించలపు ప్రదీప్, మలిపెద్ది వెంకటరమణ, జూరెడ్డి ప్రసాద్, వేముల పూడి అప్పారావు, చిరుకూరి పేర్రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చే మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రశంసా పత్రం

విశాలాంధ్ర-యలమంచిలి: మండలంలోని ములకలపల్లి గ్రామంలో గల మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్) ప్యాక్టరీ యాజమాన్యం, సి.ఎస్.ఆర్ లో భాగంగా యలమంచిలి గవర్నమెంట్ బి.సి హాస్టల్ అభివృద్ధి పనులు చేసినందుకు గాను అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంస పత్రం అందచేయడం జరిగిందని ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వి.హెచ్. చౌదరి అన్నారు. కార్యక్రమంలో సీనియర్ డిజియం ఎల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వచ్చే నెలలో జిల్లాకు ప్రధాని మోడీ రాక

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లా పారిశ్రామిక అభివృద్ధి ధ్యేయం అని, వచ్చే నెలలో నక్కపల్లి ప్రాంతానికి ప్రధాని నరేంద్ర మోడీ రానున్నట్లు పార్లమెంట్ సభ్యులు సీ.ఎం రమేష్ తెలిపారు. శనివారం జిల్లాలోని బుచ్చయ్యపేట మండలం పి. భీమవరం గ్రామం లో బీజేపీ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు ఈర్లే శ్రీరామ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ అభినందన సభ లో ముఖ్యఅతిథిగా సీఎం రమేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. జిల్లా ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం స్థానిక ప్రజా ప్రతినిధులు కట్టుబడి ఉన్నారు అని భారత ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే నెల రోజుల్లో అనకాపల్లి జిల్లాలో నక్కపల్లిలో కొత్తగా మంజూరైన ఇండస్ట్రియల్ కారిడార్కు శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవడానికి సానుకూలంగా స్పందించారని మన ప్రాంతానికి మోదీ విచ్చేసి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీకి భారీ మెజారిటీ ఇచ్చిన ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేస్తారు అని పేర్కొన్నారు.అదేవిధంగా మరిన్ని భారీ పరిశ్రమలు జిల్లాకు వస్తున్నట్లు మాడుగుల ప్రాంతంలో ఇప్పటికే సెజ్ మంజూరు కొరకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని.అనేక రంగాల పరిశ్రమలు స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని, ప్రాంత రైతాంగానికి పూర్తిగా అండగా ఉంటామని, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రాంత ప్రజలకు సాగునీరు తాగునీరు కల్పనకు కృషిచేస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో చోడవరం శాసన సభ్యులు కే ఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, అర్బన్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పివీఎస్ ఎన్ రాజు,ఎం ఎల్ సీ పాకలపాటి రఘు వర్మ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ ,రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్ ,జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పరిశ్రమల పాత్ర అభినందనీయం

కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : సామాజిక సేవద్వారా జిల్లా అభి వృద్ధికి పాటుపడుతున్న పరిశ్రమల ప్రతినిధులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అభినందించారు. కార్పొరేట్ సామాజిక భాద్యతగా జిల్లా అభివృద్ధికి పాటుపడుతున్న పరిశ్రమలను అభినందిస్తూ శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పరిశ్రమలు సామాజిక భాద్యతగా చేపడతున్న కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి తోడ్పడుతున్నాయని, అందుకు పరిశ్రమల యాజమాన్యాలకు అభినందనలు తెలియజేస్తున్నట్లుతెలిపారు. భవిష్యత్తులలో కూడా ఇదే స్ఫూర్తికొనసాగించాలని కోరారు. జిల్లాలో గల విద్యార్థి వసతిగృహాలలో మౌలికసదుపాయాలు కల్పన పనులు చేపట్టాలని తెలి పారు. వివిధ కంపెనీల నుండి సేకరించిన సుమారు యాభై లక్షల రూపా యలు విలువచేసే ముప్పదివేల దోమతెరలను జిల్లాలో గల పి.వి.టి.జి. గ్రామాలు, గిరిజన గ్రామాలు, వసతిగృహాలు,ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేయడం ద్వారా మలేరియా కేసులను తగ్గించగలిగినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. జిల్లా ఆర్థికాభివృద్ధికి పరిశ్రమలు కీలకమని, జిల్లా యంత్రాంగం వారికి కావలసిన సహాయ, సహకారాలను ఎల్లవేళలా అందిస్తుందన్నారు. జిల్లా యంత్రాంగం నుండి ఎటువంటి సహకారం కావాలన్నా నేరుగా సంప్రదించవచ్చున్నారు. సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టుటకు ప్రతిపాదనలు తయారుచేసి అందిస్తామని తెలిపారు. విజయవాడ వరదబాధితులకు జిల్లానుండి వివిధ పరిశ్రమలు సుమారు కోటి ఎనిమిది లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందించినట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి మాట్లాడుతూ పరిశ్రమలు సామాజిక భాద్యతగా చేపడతున్న కార్యక్రమాలు, అందించే సహాయం ప్రజల జీవితాలలో మార్పుకు కారణం అవుతున్నాయని తెలిపారు. కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ భాద్యత అని, కాని తొలిసారి ప్రభుత్వ యంత్రాంగం ద్వారా అభినందనలు అందుకోవడం తొలిసారని, ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందులకు ఆనందంగా ఉందని తెలిపారు. జిల్లాలో చేపట్టవలసిన సేవా కార్యక్రమాలు వివరాలు అందజేస్తే, తమ వద్ద ఉన్న ఆర్థిక వనరులకు తగిన పనులు చేపడతామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులను జిల్లా కలెక్టరు సన్మానించారు. జ్ఞాపికను, పశంసాపత్రాన్ని అందజేసారు. సామాజిక సేవలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులకు పేరుపేరున కృతజ్ఞతలు తెలియజేసి, అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి బి. దయానిధి, ముఖ్యప్రణాళిక అధికారి బి.రామారావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జి. నాగరాజారావు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యా రంగం బలోపేతానికి చంద్రబాబు, లోకేష్ కృషి : బుద్ద నాగ జగదీష్

విశాలాంధ్ర-అనకాపల్లి: నిరుద్యోగ నిర్మూలన కోసం ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైపుణ్యాభివృద్ధి కీలకమైనదిగా గుర్తించి నైపుణ్య శిక్షణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుగుదేశం పార్టీ మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు నిరుద్యోగ యువకులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాల యాలను ప్రపంచ విశ్వవిద్యా లయాల పక్కన నిలబెడతామని ప్రాగల్బాలు పలికిన జగన్ రెడ్డి వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో విద్యా వ్యవస్థను నిలువునా ముంచిందని నాగ జగదీష్ అన్నారు. రాష్ట్రంలో యువతను నిర్వీర్యం చేసి, ఉద్యోగ అవకాశాలు రాకుండా చేశారని, ప్రభుత్వం కూడా ఆదుకోవడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత రాష్ట్రంలో 13% నిరుద్యోగ సమస్య ఉన్నట్లుగా గుర్తించిందని దీనికి తగిన విధంగా ఎన్నికలకు ముందు 20 లక్షలు ఉద్యోగాలు ఇవ్వాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్ ఉద్యోగాలు వచ్చే విధంగా నైపుణ్యాభివృద్ధిని శిక్షణ ఇచ్చినట్లయితే ఉద్యోగాలు కల్పనకు అవకాశం ఉంటుందని, పరిమిత జనాభాకు మాత్రమే అందుబాటులో ఉన్న నాణ్యమైన ఉన్నత విద్యను ఎక్కువ మందికి చేరవేయాలని కూటమి ప్రభుత్వం ఇప్పటికే నడుం బిగించిందని ఉత్పాదిక రంగాన్ని వేగంగా అభివృద్ధి చేసేందుకు తగిన సంఖ్యలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిపుణుల అవసరాన్ని గుర్తించి ఊహ రచనకు పూనుకుందని నాగ జగదీష్ తెలిపారు. అమరావతిలో యూట్యూబ్ అకాడమీ, ప్రతి జిల్లాలోనూ నైపుణ్య శిక్షణ కేంద్రాలను, ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకుం టున్నారని, నాలుగు మాసాల్లో అనేక మంది దేశ విదేశాల్లో ఉన్న పారిశ్రామి కవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారని, దీనికి చంద్రబాబు లోకేష్ కృషి అద్భుతమని, దీనిలో భాగంగా విశాఖ ఆర్థిక రాజధానిగా చేయడంతో పాటు ఐటీ హబ్ గా తీర్చిదిద్దడానికి నారా లోకేష్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారని ప్రముఖ ఐటీ కంపెనీ టిసిఎస్ విశాఖపట్నంలో తమ కార్యక్రమాలు మొదలు పెడతామని ఇప్పటికే టీసీఎస్ యాజమాన్యం ప్రకటన చేసిందని, 16 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చినందుకు శుభపరిణామని నాగ జగదీష్ ఆశాభావం వ్యక్తపరిచారు.

మాడుగుల మండలాన్ని అబివృద్ధి చేయండి

విశాలాంధ్ర-మాడుగుల: మాడుగుల మండలాన్ని సమగ్ర అభివృద్ధి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేసారు. శనివారం శంకరం గ్రామంలో సిపిఎం మండల మహాసభ సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహామూర్తి అధ్యక్షతన జరిగింది. అనంతరం వారు మాట్లా డారు. మాడుగుల మండలాన్ని అన్ని విదాలుగా సమగ్రంగా అబివృద్ధి చేయాలని కోరారు మండలం లోని అత్యధిక గిరిజన గ్రామాలు ఉన్నాయని వీటిని ఐదవ షేడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేసారు పెద్దెరు ఎడమ కాలువ 4 ఎల్‌ఎ ద్వారా ఏడు గిరిజన గ్రామాలకు సాగునీరు అందిస్తామని, భూసేకరణ చేసి నేటికీ గిరిజనులకు సాగునీరు అందించలేదన్నారు. ఉరకగెడ్డ పునరావాస గిరిజ నులకు ఆర్ ఆర్ ప్యాకేజీ ద్వారా నష్టం పరిహారం చెల్లించాలని,మండలంలోని అన్ని గిరిజన గ్రామాలకు లింక్ రోడ్లు వేయాలని డిమాండ్ చేసారు. పోడుఎ ారెస్టు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉరలోవ కోండచుట్టు పట్టాలు ఇచ్చిన వారి అందరికీ అన్లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని, గ్రానైట్ తవ్వ కాలు వలన నష్టపోయిన గిరిజన గ్రామా లకు పరి హారం చెల్లించాలని, రోడ్లు మంచి నీళ్ళు సౌకర్యం కల్పించాలని కోరారు. జీడీ పిక్కలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కోనుగోలు చేయాలని, మాడుగుల మీదుగా పాడెరుకు బస్సులు నడపాలని కోరారు. రాత్రిపూట మాడు గులలో బస్సులు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని గవర్నమెంట్ ఐటిఐ పాలిటెక్నిక్,స్కిల్ డవలాప్ మెంట్ వంటి సెంటర్లు ఎర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. అసంపూర్తిగా ఉన్న మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే పూర్తి చేసి పెదలకు మెరుగైన వైద్యం అందించాలని, కాయ గూరలు రైతులకు రైతుబజారు ఎర్పాటు చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎడుగురతో ఎన్నిక కాగా మండల కార్యదర్శిగా ఇరటనర సింహమూర్తి ఎకగ్రీవంగా ఎన్నిక అయ్యారు కార్యక్రమంలో కె భవాని మువ్వలజాని సీతా వెంకటరావు దాసు మత్స్యరాజు వంతల కేశవరావు కోర్రా విజయ శాంతి ఆదిక సంఖ్యలో ప్రజల పాల్గొన్నారు.

పోలీసుల ఆయుధాల గురించి విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరం

ఎస్పీ తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: విధి నిర్వహణలో పోలీసు ఉపయోగించే ఆయుధాలు గురించి విద్యార్థులు తెలుసుకోవడం ఎంతో అవసరమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా పోలీసు ఓపెన్ హౌస్ కార్యక్రమం ను జిల్లా కేంద్రంలో గల ఎన్టీఆర్ స్టేడియంలో ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీసుల విధినిర్వహణలో విని యోగించే ఆయుధాలు వివిధ పరికరాలను విద్యార్థులు, ప్రజలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే అత్యాధునిక ఆయుధాలు, వివిధ పరికరాలు, కమ్యూనికేషన్ వినియోగం, బాంబు డిస్పోజల్ పరికరాలు తదితర విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించడం విద్యార్థులు పోలీసుల విధినిర్వహణలో వారి కష్టాన్ని, శ్రమని అర్థం చేసుకొని వారి నుండి స్ఫూర్తిని పొంది, భవిష్యత్తులో పోలీసులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి, పోలీసు శాఖ ప్రజల సేవకై ఉన్నదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పోలీసు విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపించాలనే ఉద్దేశంతో ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఈ వారోత్సవాల్లో సమాజ భద్రత, దేశ రక్షణకు విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్య క్రమాలైన వ్యాసరచన, వక్తృత్వ పరీక్ష పోటీలను విద్యార్థులకు నిర్వహించడం తోపాటు, అమరులైన పోలీసు కుటుంబాలను పరామర్శించడం మరియు బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఓపెన్ హౌస్ లో బాంబు డిస్పోజబుల్ టీం, కమ్యూనికేషన్స్, ఆయుధాల విడిభాగాల సమాచారం గూర్చి (ఏకె-47, పిస్టల్, గ్లో 17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, మల్టీ గ్యాస్ గన్ లాంచర్, గ్రేనేడ్ తదితర ఆయుధాలు), మాబ్ ని కంట్రోల్ చేసే వజ్రా వాహనం, రైట్ గేర్ ఎక్విప్మెంట్ ను ప్రదర్శించారు. జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. నైట్ విజన్, సాటిలైట్ ఫోన్, స్కానర్, వి.హెచ్.ఎఫ్ సెట్, రోబో డ్రెస్ ప్రదర్శనలో ఉంచారు. బాంబ్ డిస్పోజల్ టీం వినియోగించే డీప్ సెర్చ్ మెటల్ డిటెక్టర్, డిఫ్యూజ్ అండ్ సేఫ్టీ ఎక్విప్మెంట్, బాంబ్ సూట్, టెలిస్కోప్ మ్యానిపులేటర్, రిమోట్ వైర్ కట్టర్‌లను విద్యార్థులు ఆసక్తి గా తిలకించారు. జీవీఎంసీ గర్ల్స్ హై స్కూల్, జూనియర్ కాలేజ్, ఆదిత్య డిగ్రీ కాలేజ్, చైతన్య జూనియర్ కాలేజ్, వివేకానంద డిగ్రీ కాలేజ్ కసింకోట, సెయింట్ జోన్స్ కాలేజ్ కసింకోట, ఆర్.జి.ఆర్.పి పాలిటెక్నిక్ కాలేజ్ కసింకోట విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్ రావు, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇనస్పెక్టర్లు బాల సూర్యారావు, మన్మథరావు, రామకృష్ణారావు, సంజీవరావు, అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ విజయ్ కుమార్, అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ, అనకాపల్లి రూరల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, కసింకోట ఎస్‌హెచ్‌ఓ స్వామి నాయుడు, ఎస్సైలు ఈశ్వరరావు, ఆదినారాయణ, సిబ్బంది స్కూల్, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.